# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-01-2025**  **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారుల కోసం 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశం కానుంది.**

**3. తెలంగాణలో విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

**5. తెలంగాణలోని వ్యవసాయ మార్కెట్లను ఆధునికీకరించేందుకు నివేదికలు సిద్ధం చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.**

==========================

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారుల కోసం 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం నిన్న ఢిల్లీలో సమావేశమై పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మంత్రి వర్గ నిర్ణయాలను అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. వేతన సంఘం ఏర్పాటు ద్వారా పే ప్యానెల్ సిఫార్సులను స్వీకరించేందుకు తగినంత సమయం లభిస్తుందని చెప్పారు. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం, త్వరలో జరుగుతుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 24 సెకన్లు)

అలాగే ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం- షార్‌లో 3 వేల 985 కోట్ల రూపాయలతో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని అశ్విని వైష్టవ్ తెలిపారు.

---------------------------

సంపద సృష్టి ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

నాయుడు అన్నారు. రాష్ట్ర వృద్ధి రేటుపై అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడారు. ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని అన్నారు. మౌలిక సౌకర్యాల కల్పనలో సంస్కరణలు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి వివరిస్తూ,

వాయిస్ (37 సెకన్లు)

----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే పరిశ్రమలకు భూముల కేటాయింపులు, 10 శాతం మద్యం దుకాణాలను గీత కార్మికులకు కేటాయించడం వంటి అంశాలపై కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

----------------------------

తెలంగాణలో విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలకు సంబంధించిన గోడ పత్రికలను ముఖ్యమంత్రి నిన్న ఢిల్లీలో విడుదల చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణలో రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, 55 వేల ఉద్యోగాలు కల్పించామని అన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతోందని రేవంత్ రెడ్డి తెలుపుతూ,

వాయిస్ ( 33 సెకన్లు)

అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి సమా వేశమై పలు అంశాలపై చర్చించారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 26 సెకన్లు)

----------------------------

ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి విభాగంలో నూతన సంస్కరణలను అమలు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలోని పట్టణ ప్రణాళికా విభాగాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి రాష్ట్రంలో అమలు చేయనున్నామని పేర్కొన్నారు. భవన నిర్మాణదారులు అత్యంత సులువుగా ప్రభుత్వ అనుమతులు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

----------------------------

తెలంగాణలో అన్ని జిల్లా కేంద్రాల్లోని వ్యవసాయ మార్కెట్లను ఆధునికీకరించేందుకు నివేదికలు సిద్ధం

చేశామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. హైదరాబాద్ సమీపంలోని కొహెడ వద్ద 400 ఎకరాల్లో అత్యాధునిక మెగా మార్కెట్‌ను నిర్మిస్తామని చెప్పారు. వీటితో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి పెద్ద మార్కెట్లను మరింత అభివృద్ధి చేసేందుకు.చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తెలంగాణలో అంగన్వాడీ సేవలపై తల్లిదండ్రుల నుంచి సలహాలు సూచనలు స్వీకరిస్తామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. హైదరాబాద్ లో సంబంధిత శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,అంగన్వాడీ కేంద్రాల సేవలపై ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రజాపాలనలో ప్రజల సంక్షేమమే లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారికి పోషకా హారం అందించేందుకు జిల్లా సంక్షేమ అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. కర్నూలులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తో కలిసి ఆయా శాఖల అభివృద్ధి కార్యక్రమాల పై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. . పల్లె పండుగ కింద ఇంకా అపరిష్కృతంగా ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు.మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు.

---------------------------

---------------------------

---------------------------

---------------------------

=====================